క్లుప్తంగా

నేడు విద్యా కానుక పంపిణీ

రామచంద్రపురం రూరల్: స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు విద్యా సంస్థల ప్రాంగణంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న జగనన్న విద్యాకానుకలను సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్టు ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీలో ల్యాబ్ పనితీరుపై వివరాలు అడుగుతున్న డాక్టర్ రామిరెడ్డి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ పీహెచ్‌సీని ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర సంచాలకులు డాక్టర్ వి.రామిరెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ సేవలు, ఆసుపత్రి ప్రసవాలపై పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టీఎస్ఎస్ సందీప్‌నాయుడును అడిగి తెలుసుకున్నారు. మెడికల్ స్టోర్‌ను సందర్శించి రోగులకు అందిస్తున్న 172 రకాల మందులను తనిఖీ చేశారు. వాటి వివరాలను ఎప్పటికప్పుడు మందుల పట్టికలో పొందుపరచాలని ఆదేశించారు. ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని పరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పీహెచ్‌సీ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న స్వామి వివేకానంద యోగాశ్రమ యువకులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న, రక్తం అత్యవసరమైన 10 మంది గర్భిణుల కోసం అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన 9 మంది యువకులు ఆదివారం రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడారు. యోగాశ్రమ గురువు డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో యువకులు పి.వెంకట్, ఎం.ప్రవీణ్, ఎన్.శ్రీను, సీహెచ్ నవీన్, కేఎస్‌పీ సురేష్, ఎ.ఆనంద్, బి.ఏసురత్నం, టి.అనిల్, ఎస్.శ్రీనివాసనాయుడులు రక్తదానం చేశారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు యువకులను అభినందించారు. రోగులు, వారి కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెల్లో ఆధ్యాత్మిక తోరణాలు

- నియోజకవర్గంలో 70 ఆలయాల నిర్మాణం
- రూ.7.50 కోట్ల మంజూరు
- ఆలయాల నిర్మాణానికి మంత్రి వేణు కృషి



వెల్లలో రామాలయానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి వేణు గోపాలకృష్ణ (ఫైల్)

రామచంద్రపురం: తెలతెల్లవారు జామున పల్లెసీమల్లో భక్తిగీతాలు ఆయాల నుంచి వస్తుంటే ఉదయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. చుట్టూ పచ్చదనం, లేలేత సూర్యుని కిరణాలు, గుడిలో అర్చకుల వేద మంత్రాల వినిపిస్తుంటే గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడుతుంది. సాయంత్రం వేళలో అందరూ ఆలయాల వద్దకు చేరుకుని పలు ముచ్చట్లతో పాటుగా గ్రామ సమస్యలపైనా చర్చిస్తుంటారు. గ్రామాల్లో ప్రజలకు ఆలయాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తుంటారు. శ్రీరామాలయాలు, గ్రామ దేవతలకు చెందిన ఆలయాలు పల్లెల్లో ఎంతో ప్రసిద్ధి చెందాయి. అటువంటి ఆలయాలు ఎన్నో జీర్ణోద్ధరణకు గురుయ్యాయి. గతంలో ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఆలయాలను పట్టించుకునే నాథులే కరువయ్యారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 76 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి అనుగుణంగా పంచాయతీల పరిధిలో మరో 80 వరకూ శివారు గ్రామాలు కూడా ఉన్నాయి. నియోజకవర్గంలో కె.గంగవరం, కాజులూరు మండలం గోదావరి తీరంలో ఉండడంతో ఆ మండలంలో ఆలయాలు అధికంగా ఉన్నాయి. రామచంద్రపురం మండలం పుణ్య క్షేత్రమైన ద్రాక్షారామకు చుట్టుపక్కల గ్రామాల్లో రామాలయాలతో పాటుగా పురాతన శివాలయాలు కూడా ఉన్నాయి. చాలా ఆలయాలు పూర్వీకులు కట్టినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి.

మంత్రి వేణు చొరవతో నూతన ఆలయాలు

స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ శిథిలమైన శ్రీరామాలయాలు, గ్రామ దేవతల ఆలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లా ఆలయ అధికారులతో సంప్రదించి మొత్తం ఆలయాలను రెండు విడతలుగా నూతన ఆలయాలుగా నిర్మించేందుకు తలపెట్టారు. గ్రామాల నుంచి వచ్చిన పెద్దలు అడిగిందే తడవుగా నిధులు మంజూరు అయ్యేలా చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గం మొత్తం సర్వే చేయించి మొదటి విడతలో సుమారు 72 ఆలయాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఒక్కో ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్టు నుంచి రూ. 10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ మంజూరు చేయించి నిధులు తీసుకువచ్చారు. ఇప్పటివరకూ రూ.7 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ఆలయాలు 80 శాతం పైగా చకచకా శంకుస్థాపనలు చేసి నిర్మాణాలు ఊపందుకున్నాయి. గతంలో ఎవ్వరూ చేయని విధంగా మంత్రి వేణు ఆలయాల అభివృద్ధికి తీసుకున్న చర్యలపై గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నూతన ఆలయాలతో నియోజకవర్గ పల్లె సీమలు ఆధ్మాత్మికత సంతరించుకుంటోంది.

నూతన ఆలయాల నిర్మాణానికి..



కొన్నేళ్లుగా గ్రామాల్లో వివిధ ఆలయాలను పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. వాటిని గమనించిన గ్రామ ప్రజల అభ్యర్థన మేరకు ఎలాగైన వాటిని పునర్నిర్మించాలనుకున్నాను. అందులో భాగంగానే మొదటి విడతలో 70 ఆలయాలకు పైగా నిధులు తీసుకువచ్చాం. త్వరలోనే మిగిలిన ఆలయాలకు కూడా రెండో విడతలో నిధులు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

– చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాష్ట్ర మంత్రి

ఏళ్లనాటి సమస్య పరిష్కారం



చాలా సంవత్సరాలుగా గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకోవాలని ప్రజలు తాపత్రాయ పడేవారు. గాని సంఘపరంగా ఆర్థికంగా ఇబ్బందుల వల్ల నిర్మాణాలు చేపట్టలేకపోయారు. ప్రస్తుతం మంత్రి వేణు సహకారంతో గ్రామ ప్రజలు ఆలయాలను నూతనంగా నిర్మించడం అభినందనీయం. ఎన్నో ఏళ్లుగా గ్రామాల్లో ఉన్న ఆలయాల సమస్య నేటికి పరిష్కారమవుతోంది.

– నరాల ఏడుకొండలు, తాలూకా శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు

మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి సేవలు మరువలేనివి



దొమ్మేటి ఆత్మశాంతి కోసం మౌనం పాటిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ తదితర నాయకులు

కాజులూరు: మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు సేవలు కాజులూరు మండల ప్రజలు ఎన్నటికీ మరువలేనివని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. దుగ్గుదుర్రుకు చెందిన తాళ్ళరేవు మాజీ ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు మృతి చెంది 11 రోజులు పూర్తయిన సందర్భంగా ఆయన అభిమానులు, కార్యకర్తలు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సంతాప సభలు నిర్వహించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శలపాకలో జరిగిన కార్యక్రమంలో మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ కాజులూరు ఎంపీపీగానూ, తాళ్లరేవు నియోజకవర్గ శాసన సభ్యుడిగానూ, ప్రతిపక్ష నేతగానూ పని చేసిన దొమ్మేటి స్థానిక మండల గ్రామాల ప్రజలకు ఎనలేని సేవలందించారన్నారు. ఆయన సేవలకు గుర్తుగా దొమ్మేటి భౌతికకాయానికి అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించామన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు మంత్రి వేణుగోపాలకృష్ణతో కలసి రెండు నిమిషాలు మౌనం పాటించారు.

రేపు చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రామచంద్రపురం: నూతనంగా ఏర్పాటైన చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం కార్యక్రమం మంగళవారం నిర్వహిస్తున్నట్టు ఉపాధ్యాక్షులు కంచుమర్తి బాబూరావు వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం కార్యవర్గ సభ్యులతో కలిసి ఆయన పట్టణంలోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ 2023–25 సంవత్సరాలకు గాను పట్టణంలోని వ్యాపార, వాణిజ్య సంస్థలకు చెందిన వారు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. ఈనెల 13న స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణు, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి శ్రీధర్ ముఖ్య అతిథిలుగా హాజరవుతారన్నారు.

నూతన కార్యవర్గం వీరే..

గౌరవాధ్యాక్షులుగా అడ్డూరి జగన్నాథవర్మ, నల్లమిల్లి జనార్దనరెడ్డి(చంటిరెడ్డి), అధ్యక్షుడిగా కొవ్వూరితాతారెడ్డి, ఉపాధ్యాక్షుడిగా కంచుమర్తి బాబూరావు, కార్యదర్శిగా పసుపులేటి వీరవెంకట సత్యనారాయణమూర్తి(సత్తిబాబు), సహాయ కార్యదర్శిగా శిరిగినీడి దుర్గాప్రసాద్, కోశాధికారిగా మాదాల శ్రీలక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులుగా కొండపల్లి వీరరాఘవులు, కొమరిసురేష్, కర్రి శివారెడ్డి, గ్రంధి నూకరాజు, అల్లక వీరవెంకట సత్యప్రసాద్, మహిపాల ఆదినారాయణ, సంజయ్ జైన్, కొమ్మిరెడ్డి సూర్యచంద్ర దుర్గాప్రసాద్, దంబాట శివకుఆర్, గంగరాజు వెంకటేశ్వరరావు, బొడ్డు శ్రీనివాస్, తిరుమలరాజు ప్రభాకర్‌వర్మ(చందమామ వాసు), దుద్దుకూరి మల్యాద్రి, మట్టపర్తి రామకృష్ణ.

వైఎస్సార్ సీపీలో నూతనోత్సాహం

- టీడీపీ, జనసేన నుంచి భారీ చేరికలు
- కమ్మ సామాజిక వర్గం నుంచి నేతలు రాక
- మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో చేరిక



ఎమ్మెల్సీ తోట, పృథ్వీరాజ్, రాజశేఖర్ తదితరులను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు



మండపేటలో భారీ ర్యాలీలో రాజశేఖర్, పార్టీశ్రేణులు

మండపేట: సార్వత్రిక ఎన్నికల వేడి రాజుకుంటున్న వేళ మండపేట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ మరింత బలం పుంజుకొంటోంది. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమర్థవంతమైన నాయకత్వానికి ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరుతున్నారు. టీడీపీకి కంచుకోటగా ఉన్న మండపేట నియోజకవర్గంలో ఎమ్మెల్సీ తోట రాకతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గ్రూపులకు చెక్ పెట్టి పార్టీ కేడర్‌ను ఏకతాటిపైకి తెచ్చారు. మండపేట చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్సిపాలిటీతో పాటు, మూడు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ జెండాను రెపరెపలాడించారు. సీఎం జగన్ బాటలో పార్టీలు, కులాలు మతాల చూడకుండా సాయం కోసం వచ్చిన వారికి అండగా నిలవడం ద్వారా నియోజకవర్గ ప్రజల్లో ఎమ్మెల్సీ తోట తనదైన ముద్రవేశారు. సీఎం జగన్ జనరంజక పాలన, ఎమ్మెల్సీ తోట నాయత్వానికి ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నుంచి ఇటీవల వందలాది మంది పార్టీలో చేరారు. వీరిలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారితో పాటు టీడీపీకి వెన్నుదన్నుగా ఉంటున్న కమ్మ సామాజిక వర్గం నేతలు ఉండడం గమనార్హం. తాజాగా మండపేటలో టీడీపీ కీలక నేతగా ఉన్న మేకా శ్రీనివాస్ ఆదివారం తన అనుచరగణంతో వైఎస్సార్ సీపీలో చేరారు. అలాగే జనసేన నాయకులు ఎమ్మెల్సీ తోట సమక్షంలో పార్టీలో చేరారు.

రాజశేఖర్ సారథ్యంలో భారీ ర్యాలీ

వైఎస్సార్ సీపీలోకి చేరికలు సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త నేమాని కృష్ణ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీల నుంచి పార్టీలో చేరుతున్న వారితో వందల మంది పార్టీ నాయకులు, కార్యకర్తలతో స్థానిక మారేడుబాక వంతెన వద్ద నుంచి కేపీ రోడ్డు, కలువపువ్వు సెంటర్ మీదుగా బస్టాండు వద్ద సూర్య ఫంక్షన్ హాల్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్పులు, తీన్‌మార్ వాయిద్యాలతో ర్యాలీ సాగింది. స్థానిక ఓం జ్యూయలర్స్ వద్ద రాజశేఖర్, మేకా శ్రీనివాస్‌లను పార్టీ నేతలు కొమ్ము రాంబాబు, పతివాడ రమణలు శాలువాలతో సత్కరించి ర్యాలీకి స్వాగతం పలికారు. అనంతరం సూర్యఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ తోట సమక్షంలో 500 మందికి పైగా టీడీపీ, జనసేన పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన వ్యాపార వేత్త నేమాని రాజశేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, యువనేత తోట పృథ్వీరాజ్, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెరవేరనున్న సొంతింటి కల

- శలపాకలో కోలాహలంగా పట్టాల పంపిణీ
- ఇప్పటి వరకూ 65.18 ఎకరాలలో 3,415 లబ్ధిదారులకు పట్టాలు అందజేసిన ప్రభుత్వం



ఇళ్లస్థలాల పంపిణీ సభలో ప్రసంగిస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ



హాజరైన లబ్ధిదారులు

కాజులూరు: రాష్ట్రంలో ప్రతి మహిళను లక్షాధికారులుగా చేస్తామని పాదయాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రకటన ఇళ్లస్థలాల పంపిణీతో నెరవేరుతోంది. నిలువనీడలేక పరాయి పంచన కాలం వెళ్లబుచ్చుతున్న నిరుపేదలకు జగనన్న ఇళ్ల స్థలాల పంపిణీ వరంగా మారింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ఇళ్లస్థలాల పంపిణీ కార్యక్రమం శలపాకలో ఆదివారం కోలాహలంగా సాగింది. గ్రామంలో ఎంపిక చేసిన 10.80 ఎకరాలలో గొల్లపాలెం 198 మంది లబ్ధిదారులకు, తణుకువాడకు చెందిన 94 మంది లబ్ధిదారులకు, శలపాకకు చెందిన 20 మంది లబ్ధిదారులకు, మతుకుమిల్లికి చెందిన 41 మంది లబ్ధిదారులకు బందనపూడికి చెందిన 83 మంది లబ్ధిదారులకు రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ చేతుల మీదుగా ఇళ్ల పట్టాలను అందజేశారు. మొత్తం 436 మంది లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నాయకులతో శలపాకలో పండగ వాతావరణం నెలకొంది. వైఎస్సార్ సీపీ అధికారంలోనికి వచ్చాక కాజులూరు మండల గ్రామాలలో ఇప్పటి వరకూ 65.18 ఎకరాలను రెవెన్యూ అధికారులు ఇళ్లస్థలాలకు సేకరించారు. ఈ స్థలాల్లో లే అవుట్‌లను ఏర్పాటు చేసి మొత్తం 3415 సైట్లను పేదలకు కేటాయించారు. సుమారు 90 శాతం పంపిణీ పూర్తవ్వగా పలువురు లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. గత తెలుగుదేశం పార్టీ పాలనలో సెంటు భూమి కూడా పంపిణీ చెసిన దాఖలాల్లేవు. సీఎం జగన్ అధికారంలోకి రాగానే పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేసి పేదలకు ఉండడానికి నీడ కల్పిస్తున్నారు. ప్రభుత్వ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగానూ నిలదొక్కుకోవాలని రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ లబ్ధిదారులకు సూచించారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా పాదయాత్రలో ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన హామీ మేరకు పేదలకు ఇళ్లస్థలాలు ఇస్తూ మాట నిలుపుకొన్నారన్నారు.


పదేళ్లుగా అద్దె గుడిసెలోనే ఉన్నాం



ఖమ్మం నుంచి కూలి పనుల కోసం పదేళ్ల క్రితం గొల్లపాలెం వచ్చాం. ఇక్కడే స్థిరపడ్డాం. అప్పటి నుంచి అద్దె గుడిసెలోనే ఉంటున్నాం. అద్దె గుడిసేలోనే కాలం వెళ్లబుచ్చుతున్న మాకు ఇన్నాళ్ళకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దయ వల్ల ఇళ్ల స్థలం మంజూరైంది.

– రాయుడు రాధాకుమారి, గొల్లపాలెం

రుణపడి ఉంటాం



రోజూ వచ్చే కూలితోనే జీవనం సాగిస్తున్నాం. అందులో అద్దెకు కొంత ఇచ్చేయాల్సి వస్తోంది. దీంతో కుటుంబ పోషనే కష్టంగా ఉంటోంది. ఈ పరిస్థితులలో సీఎం జగన్ దయ వల్ల ఇళ్ల స్థలం వచ్చింది. ఆ మహానుబావుడికి మేము రుణపడి ఉంటాం.

– ఎన్‌వీఎస్ పద్మకుమారి, శలపాక

కృతజ్ఞతలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మ్మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడు అనిపించుకున్నారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం మాకు ఇళ్ల స్థలం ఇచ్చారు. ఇన్నేళ్లుకు సొంతింటి కళ నెరవేరనుంది. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

– అలజంగి రోజా తణుకువాడ

విజ్ఞాన వికాసంతో సమాజాభివృద్ధి



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో చిన్నారులకు బహుమతినందిస్తున్న పెద్దలు



మాచవరంలో బహుమతులు అందుకున్న చిన్నారులు



విజేతలకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న చిన్నారావు



ద్రాక్షారామలో విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసిన ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం: మానవ విజ్ఞాన వికాసం సమాజాభివృద్ధికి దోహదపడుతుందని ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో మే 8వ తేదీన ప్రారంభమైన శిబిరం విజయవంతంగా ముగియడంపై గ్రామ సర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉప సర్పంచ్ బొక్కా రాంబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై నిర్వహించిన ప్రతిభా పోటీల్లోని విజేతలకు ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా బహుమతులనందించారు. ఎన్నారై విజయచంద్ర ఐదుగురు విద్యార్థులకు రూ.500 చొప్పున నగదు బహుమతులనందించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్స్ లక్ష్మి, వంశీ, భానుతేజ, రాజేంద్ర పాల్గొన్నారు.

రాయవరం: గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గత 35 రోజులుగా నిర్వహించిన గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసింది. మాచవరం గ్రామీణ గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కత్తుల మహాలక్ష్మి, ఎంపీటీసీ పలివెల శోభన సతీష్, సచివాలయ మండల కన్వీనర్ తమలంపూడి సత్యనారాయణ రెడ్డి హాజరై గ్రంథాలయంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గౌరీ మెడికల్ వెంకటరెడ్డి, గ్రంథాలయ టీచర్ ప్రమీల పాల్గొన్నారు.

కాజులూరు: స్థానిక గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమం జరిగింది. గ్రంథాలయాధికారి కె.ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నేత, కాజులూరు ఉప సర్పంచ్ దండంగి చిన్నారావు మాట్లాడారు. మారుతున్న యాంత్రిక జీవనంలో పుస్తక పఠనానికి అందరూ దూరమవుతున్నారన్నారు. పుస్తక పఠనం ద్వారా సామాజిక అంశాలపై అవగాహన పెరుగుతుందన్నారు. అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో పాటలు, ఆటలు, పుస్తక పఠనం, డ్రాయింగ్ తదితర అంశాలపై ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నాయకులు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెలగాకాపు సంఘం నేత యాళ్ళ సత్తిబాబు, స్థానిక జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఎం.రమణమూర్తి, వినాయక పాఠశాల కరస్పాండెంట్ టి.కిశోర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో వేసవి సెలవుల్లో ప్రభుత్వం నిర్వహించిన ఉచిత వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. విజ్ఞానం, నైతిక ప్రవర్తన, స్పోకెన్ ఇంగ్లీషు, క్రాఫ్ట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన వివిద పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థులకు శిక్షణ ఇవ్వడంలో సహకరించిన విశ్రాంత అధ్యాపకుడు శివరావు, ప్రధానోపాధ్యాయుడు బీవీబీఎల్ నారాయణ మాస్టారు, బీవీఆర్ పద్మావతి తదితరులకు గ్రంథాలయ అధికారి అరుణ కృతజ్ఞతలు తెలిపారు.

ఆ చిన్నారుల సేవా స్ఫూర్తి ఆదర్శనీయం



ఔషధీకృత చలివేంద్రంలో సేవలందిస్తున్న చిన్నారులు

అమలాపురం టౌన్: సాధారణంగా పరీక్షలయ్యాక స్కూళ్లకు ఇచ్చే సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళదామా..? ఏదైనా వినోద యాత్రకు వెళదామా...? లేదా సమ్మర్ కోచింగ్ క్యాంపులకు వెళ్లి ఏదైనా నేర్చుకుందామా..? అని ఆలోచించే నేటి పిల్లల్లో ఆధ్యాత్మిక, సామాజిక సేవలో గడుపుదామనుకునే వారు బహు తక్కువే ఉంటారు. గౌతమ మహర్షి అక్షయ పాత్ర ఆధ్వర్యంలో స్థానిక నల్లవంతెన–ఎర్ర వంతెన బైపాస్ రోడ్డులో దక్షిణేశ్వర కాలభైరవ శక్తి స్థల్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రంలో 8 ఏళ్ల నుంచి 16 ఏళ్ల వయసున్న 9 మంది విద్యార్థులు గత రెండు నెలలుగా పాదచారులు, వాహన చోదకులకు దాహార్తిని తీర్చే సేవలో నిమగ్నమయ్యారు. విద్యార్థులు లింగోలు దత్త ఈశ్వర్ సాయి, రామసాయి, లక్ష్మణ సాయి, యశ్వంత్ అభిరామ్, సాయి శ్రీవల్లి, వర్మ, చాగంటి నిహాల్ రామ్, త్సవటపల్లి తేజ, కొమానపల్లి ధన్విల సేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు.

ముగిసిన తైక్వాండో శిక్షణ శిబిరం

అంబాజీపేట: అంబాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో గత 30 రోజులుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తైక్వాండో వేసవి ఉచిత శిక్షణ శిబిరం ఆదివారంతో ముగిసినట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అంబాజీపేట ఎస్సై ఎ.చైతన్యకుమార్ వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న 84 మంది క్రీడాకారులకు సర్టిఫికెట్లు, 17 మంది తైక్వాండో క్రీడాకారులకు బ్లాక్ బెల్ట్‌లను అందజేశారు. చైతన్యకుమార్ మాట్లాడుతూ తైక్వాండో వంటి యుద్ధ క్రీడలు నేర్చుకోవడం వలన శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం పెంపొందుతుందన్నారు.

ఉత్సాహంగా బ్రహ్మకుమారీస్ ర్యాలీ



అమలాపురం ఓం శాంతి పీస్ మార్చ్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: యువతకు స్ఫూర్తినిచ్చే శాంతి స్థాపన, సామరస్య భవిష్యత్ కావాలని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ పిలుపునిచ్చారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం అమలాపురం ఓం శాంతి కేంద్రం ఆధ్వర్యంలో అమలాపురంలో ఆదివారం ఉదయం జరిగిన బ్రహ్మకుమారీస్ వై 20 పీస్ మార్చ్‌ను స్థానిక ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద 216 జాతీయ రహదారిపై ఎస్పీ శ్రీధర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ర్యాలీ ఎస్‌కేబీఆర్ కళాశాల నుంచి సుబ్బారాయుడు చెరువు, హైస్కూలు సెంటరు, గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు మీదుగా గరిగుంట చెరువు వద్ద నూతనంగా నిర్మించిన నూతన ఓం శాంతి కేంద్ర భవనం వరకూ సాగింది. బ్రహ్మ కుమారీస్ కేంద్ర యూనియన్ మినిస్ట్రీ ఆఫ్ యూత్ అండ్ స్పోర్ట్స్ సంయుక్తంగా దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న వై 20 సిరీస్ కార్యక్రమంలో భాగంగా అమలాపురంలో పీస్ మార్చ్ ఏర్పాటు చేసినట్టు ఓం శాంతి కేంద్ర ప్రతినిధి బీకే స్వరూప తెలిపారు. ర్యాలీలో మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, విద్యార్థులు, బాస్కెట్ బాల్ క్రీడాకారులు, ఎన్‌సీసీ క్యాండెట్లు పాల్గొన్నారు.